# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి




*(గత సంచిక తరువాయి)*

***18-9-2015***

ఉదయం అలారం మోగకుండానే పదినిమిషాల ముందు మెలుకువ వచ్చింది. ఎనిమిదికల్లా రెడీ అయి అబ్బా మియా అనే బ్రేక్‌ఫాస్ట్ హాల్‌కి వెళ్ళాము. దీపక్ మా అందరి టేబుల్స్ దగ్గరకి వచ్చి గైడ్ వచ్చాడని, తిన్నాక లాబీలోకి వెళ్ళమని చెప్పాడు. కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్ట్‌లో బ్రెడ్ టోస్ట్ చేసుకుని జామ్‌తో తిన్నాం. బ్రెడ్ టోస్టర్ దగ్గర క్యూ ఉంది. ఆరెంజ్ జూస్ తీసుకున్నాం. మా గ్రూప్‌లోని చాలామంది ఆడవాళ్ళు బ్రేక్‌ఫాస్ట్ టేబుల్స్ మీది ఏపిల్స్ ఆరెంజెస్‌లాంటి పళ్ళని తమ హేండ్‌బేగ్స్‌లో వేసుకుని, లంచ్ టైమ్‌లో తినేవారు. లక్షలు ఖర్చుపెట్టి ట్రిప్‌కి వచ్చినవారు, చిన్న విషయాల్లో పడే కక్కుర్తిని చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది.

ఆ రోజు సగం రోజే టూర్. మిగిలిన సగం రోజు ఫ్రీం టైం.



గైడ్ ఆంటోనియో

దీపక్ ఫేమిలీస్‌ని లెక్కపెట్టుకున్నాక బస్ కదిలింది. గాయత్రీ మంత్రం చదివాక గైడ్ ఆంటోనియోని పరిచయం చేసాడు. ఏభై ఏళ్ళ అతను ఇలా చెప్పాడు.

"బ్యూనోస్ డియాస్. అంటే గుడ్ మార్నింగ్. స్పెయిన్‌లో ఇది మీ ఆఖరిరోజు. రేపు వెళ్ళిపోతున్నారు. మా దేశంలో మీ టూర్ ఇంతదాకా బాగా జరిగిందని, మీరు ఎంజాయ్ చేసారని ఆశిస్తాను. స్పెయ్యిన్‌కి ఈశాన్య తీరంలోని పురాతన నగరంలో మీరున్నారు. కేటలోనియాకి బార్సిలోనా రాజధాని. రోమన్స్ దీన్ని నిర్మించారు. కేటలోనియాకి బార్సిలోనా రాజధాని. రోమన్స్ దీన్ని నిర్మించారు. మెడిటరేనియన్ సముద్రతీరాన ఐబీరియన్ పెనున్సులాలోని బార్సిలోనాకి ఆ పేరెలా వచ్చింది? పురాతన ఐబీరియన్ బార్కెనో నాణెం మీది లేటిన్ పదం బార్సినో నించి ఈ పేరు వచ్చింది. ఇక్కడ క్రీస్తు పూర్వం 5000కి చెందిన సమాధులని కనుగొన్నారు కాబట్టి ఇది అతి పురాతన నగరమని చెప్పచ్చు.

ఇదిప్పుడు ముఖ్యమైన కల్చరల్ సెంటర్, టూరిస్ట్ అధికంగా వచ్చే నగరం కూడా. నగర జనాభా పదహారు లక్షల నలభైవేలు. శివార్లు కూడా కలిపి నలభై లక్షల ఎనభై వేలమంది నివశిస్తున్నారు. ఇది స్పెయిన్‌లోని రెండో పెద్ద నగరం. యూరప్‌లో పేరిస్ తర్వాత ఇది ఎక్కువ జనాభాగల ఐదో నగరం. టూరిజంలో కూడా ఐదో స్థానమే (పేరిస్, లండన్, ఇస్తాంబుల్, రోమ్‌ల తర్వాతి స్థానం) లోబ్రిగా, బెజోస్ నదులు ఉన్నాయి. పెద్ద మౌంటెన్ రేంజ్ కూడా ఉంది. యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్స్ ఇక్కడ చాలా ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ బార్సిలోనా, పాంపవా ఫేబర్ యూనివర్సిటీలు

కూడా ఇక్కడే ఉన్నాయి. పారిశ్రామికీకరణ వల్ల ఈ నగరం బాగా అభివృద్ధి చెందింది. 1992లో సమ్మర్ ఒలింపిక్స్ ఇక్కడే జరిగాయి. ఆ సందర్భంగా సముద్రతీరంలోని పారిశ్రామిక భవంతులని కూల్చేసి మూడు కిలోమీటర్ల పొడవైన బీచ్‌ని నిర్మించారు. ఇక్కడ బీచ్‌లు, గ్రీనరీ ఏరియా అధికం.

"మనం మొదటగా ఒలింపిక్ పార్క్‌కి వెళ్తున్నాం. ఇప్పటికీ అక్కడ అంతర్జాతీయ టోర్నమెంట్స్ జరుగుతూనే ఉన్నాయి. యూరప్‌లోని ప్రధాన ఓడరేవుల్లో ఒకటి ఇక్కడే ఉంది. ఇక్కడ నించి ఫ్రాన్స్‌కి, యూరప్‌లోని అనేక చోట్లకి హై స్పీడ్ రైలు కనెక్షన్స్ ఉన్నాయి. 18వ శతాబ్దంలో ఈ సముద్ర తీరాన ఓ కోటని నిర్మించారు. 1794లో ఫ్రెంచ్ ఎస్ట్రానమర్ పియరీ ఫ్రాంకోయిస్ ఆండ్రే మెషెన్ ఇక్కడే మీటర్ కొలతని రూపొందించాడు.

"డిసెంబర్ నించి మార్చ్‌దాకా కొద్దిగా చలి. మిగిలిన నెలలన్నీ వేడి ఎక్కువ. బార్సిలోనాలోని 41%వలసదారులే. వారిలోని 22.5%స్పెయిన్ బయట జన్మించినవారు. వారు ఇటలీ, ఫ్రాన్స్ నించి ఎక్కువగా వచ్చారు. పాకిస్థాన్ నించి 20,000 మంది వచ్చారు. వారికో కాలనీ కూడా ఉంది. జపనీస్‌కి కూడా ఓ కాలనీ ఉంది. ఇక్కడి 50 శాతం మంది కేథలిక్ క్రిస్టియన్స్.


ఒలింపిక్ స్టేడియం

ఇక్కడ జేబు దొంగలు అధికం కాబట్టి మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. బార్సిలోనా పౌరులు పర్యాటకులని ద్వేషిస్తారని చెపితే మీకు ఆశ్చర్యం కలగచ్చు. కారణం ఇళ్ళ కొరత. హాలిడే అపార్ట్‌మెంట్స్, ఎయిర్ బిఎన్‌బి అపార్ట్‌మెంట్స్ పెరిగిపోయి స్థానికులకి ఇళ్ళ అద్దెలు పెరిగాయి. (2017లో లక్షన్నర మంది 'టూరిస్ట్స్. గో హోం. బార్సిలోనా ఈజ్ నాట్ ఫర్ సేల్' అనే ప్లకార్డ్స్‌తో డిమాన్‌స్ట్రేషన్స్ కూడా నిర్వహించారు. ఆ ఏడాది టూరిస్ట్‌లు మూడువేలకోట్ల యూరోలని బార్సిలోనాలో ఖర్చు చేసారు)

పదిన్నరకి మా కోచ్ ఒలింపిక్ పార్క్ ఆవరణలో ఆగింది. గైడ్ వెంట ఆ పార్క్‌లోకి నడిచాం. క్రీడలేమీ ఆ రోజు జరగకపోవడంతో పర్యాటకులు మాత్రమే ఉన్నారు. ఇక్కడ ఎత్తైన టెలికమ్యూనికేషన్స్ టవర్ ఉంది. అనేక స్టేడియాలు, రెస్టారెంట్స్ ఆడిటోరియాలు, మ్యూజిక్ షాప్స్ ఉన్నాయి. 'ది ఒలింపిక్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని మేం చూడలేదు. అందులో ప్రపంచంలోని అన్ని క్రీడలకి సంబంధించినవి ప్రదర్శనలో ఉన్నాయి.

"1929లో ఇంటర్నేషనల్ ఎక్స్‌పొజిషన్ కోసం నిర్మించబడ్డ ఇది అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1992 సమ్మర్ ఒలింపిక్స్ కోసం చాలా అభివృద్ధి చేసారు. ఇక్కడి స్టేడియంలో మైఖేల్ జాక్సన్, మడోనా, రోలింగ్ స్టోన్స్ మొదలైనవారు సంగీత కచేరీలు చేసారు" ఆంటోనియో చెప్పాడు.


ద జాన్ బ్రాసా పార్క్‌లో శిల్పాలు

ఎండ ఎక్కువగా వున్నా ఆ స్టేడియమ్స్‌ని తిరిగి చూసాం. పదకొండున్నరకి కోచ్ ఎక్కి సమీపంలోని జార్డెన్స్ ద జాన్ బ్రాసా పార్క్‌కి చేరుకున్నాం. ఒకప్పుడు ఇది మాంట్ జ్యూక్ ఎమ్యూజ్‌మెంట్ పార్క్. ఇక్కడ చెట్లు, వాకింగ్ ట్రయల్స్, ఓ బార్, పిక్‌నిక్ టేబుల్స్, ఫౌంటెన్స్, అందమైన లేండ్ స్కేప్స్ ఉన్నాయి. దీన్ని అనవసరంగా టూర్లో కలిపారని మాలోని కొందరు అసంతృప్తిని వెల్లడి చేసారు. అక్కడనించి కోచ్‌లో ఆంటోనీ గాడీ

(1852-1926) అనే ఆర్కిటెక్ట్ డిజైన్ చేసిన సగ్రాదా ఫేమిలియా అనే కెథడ్రిల్‌కి వెళ్ళాం. ఇది యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్. గైడ్ అందరికీ ఇయర్ ఫోన్స్ ఇచ్చి అవి పని చేస్తున్నాయో లేదో చెక్ చేసాక అతనివెంట లోపలికి నడిచాం. గాడీ దేహాన్ని ఇక్కడే ఖననం చేసారు. ఆ సమాధిని చూపించి చెప్పాడు.

"ఈ కెథడ్రిల్ నిర్మాణం మార్చ్ 1882లో ప్రజా విరాళాలతో ఆరంభమైంది. 1926లో గాడీ మరణించేనాటికి పావువంతు మాత్రమే పూర్తయింది. స్పేనిష్ సివిల్ వార్ వల్ల దీని నిర్మాణం ఆగిపోయింది. జులై 1936లో విప్లవకారులు ఇందులోకి చొరబడి క్రిప్ట్(సమాధులు ఉంచే ప్రదేశం)ని తగలబెట్టి, గాడీ వర్క్‌షాప్‌లోని నిర్మాణ డ్రాయింగ్స్‌ని, ప్లాస్టర్ మోడల్స్‌ని నాశనం చేసారు. 1950లో మళ్ళీ నిర్మాణం మొదలై 2010కి సగం పూర్తయింది.



కెథడ్రిల్


నవంబర్ 7 2010న పోప్ బెనడిక్ట్ -16 ఈ చర్చ్‌ని మైనర్ బసిలికాగా ప్రకటించాడు. గాడీ నూరవ వర్ధంతైన 2026కి ఇది పూర్తవచ్చు."

కోవిడ్ -19 వల్ల బహుశ ఇది సాధ్యం కాకపోవచ్చు.




సుడోకు(పజిల్)

రంగుల్లేని ఆ కెథడ్రిల్ బయట ఆర్కిటెక్చర్ యూరోపియన్ కెథడ్రిల్స్‌లా గోథిక్ స్టైల్‌లో కనిపించింది. లోపల స్టైన్డ్ గ్లాస్ కిటికీలు, వర్జిన్ మేరి విగ్రహం ఉన్నాయి. దాదాపు 50 అడుగుల ఎత్తైన ఈ కెథడ్రిల్ గోడల మీద సుడోకు తరహా ఓ పజిల్ కనిపించింది. ఓ చరురస్తంలో నిలువుగా అడ్డంగా వరసకి నాలుగు చొప్పున అంకెలు ఉన్నాయి. వాటిని ఎట్నించి కూడినా 33 రావడం విశేషం. జీసస్ పుట్టుకకి సింబల్‌గా ఉదయించే సూర్యకిరణాలు పడే చోట నేటివిటీ దృశ్యం (జీసస్ పుట్టుక) శిల్పాలని బయట చెక్కారు. మరో చోట పేషన్ ఆఫ్ క్రైస్ట్ అంటే శిలువ వేసే దృశ్యాన్ని కూడా చెక్కారు. తలుపుల మీద లార్డ్స్ ప్లేయర్‌ని చెక్కారు. గోడల మీద గివ్ అజ్ డైలీ బ్రెడ్ అనే క్రిస్టియన్ ప్రార్ధనని 50 భాషల్లో చెక్కారు. తలుపు హేండిల్స్ మీద ఏజి అనే ఆ ఆర్కిటెక్ట్ ఏంథోనీ గాడీ ఇనీషియల్స్ చెక్కారు. అనేక కాలాలలో నిర్మించిన ఆ కెథడ్రిల్ లోపల వైవిధ్యమైన నిర్మాణాలున్నాయి.



గాడీ స్థానికులు, చర్చ్ నిర్మాణ కూలీల పిల్లల కోసం పక్కనే చిన్న స్కూల్ బిల్డింగ్‌ని కూడా నిర్మించాడు. చర్చ్‌లోంచి కిందకి మెట్లున్నాయి. అక్కడ రాక్షసులు, ఫాల్స్ గాడ్స్, నరకం చిత్రాలు, సెవెన్ డెడ్లీ సిన్స్ (లోభం, కామం, గర్వం, తిండిబోతు తనం, బద్దకం, కోపం, అసూయ) సెవెన్ వర్చ్యూస్ (దయ శ్రద్ధ, సహనం, దాతృత్వం, నమ్రత, శీలం, మద్యపానం చేయకపోవడం) విగ్రహాలు ఉన్నాయి.

అక్కడినించి కోచ్‌లో లా రాంబ్లాస్ అనే 1.2 కిలోమీటర్ల పొడవైన వీధికి వెళ్తూంటే గైడ్ మాకు చెప్పాడు.

"లా రాంబ్లాస్ మొదట్లో పొడవైన మురికినీళ్ళ కాలువ. 1440లో ఈ కాలువని దారి

మళ్ళించాక క్రమంగా ఇది వీధిగా రూపొంది, షాప్స్ ఏర్పడ్డాయి. 1553లో జిసుట్ బెత్లెహేమ్ అనే మొనాస్ట్రీని నిర్మించారు. 1703లో మొదటగా ఈ రోడ్‌కి అటు ఇటు బిర్చ్ చెట్లని నాటారు. తర్వాత వాటి స్థానంలో ఎక్మ్ ట్రీస్‌ని పాతారు. 1832లో అకేషా చెట్లని పాతారు. ప్రస్తుతం ఉన్నవి 1859లో నాటిన చెట్లు. 1835లో, 1936 - 1939లో జరిగిన సివిల్ వార్లో తిరుగుబాటుదార్లు ఇక్కడి మొనాస్ట్రీలని, చర్చ్‌లని తగలబెట్టారు. 2010దాకా ఇది పక్షులు, జంతువుల ఓపెన్ మార్కెట్‌గా ఉండేది. కానీ ఏనిమల్ ప్రొటెక్షన్ చట్టాల వల్ల వీటిని మూసేసారు. దీని పేవ్‌మెంట్స్‌ని ఒకప్పటి కాలువని గుర్తుచేసేలా అలల్లా డిజైన్ చేసారు. మీరు లా రంబ్లాస్‌లో లంచ్ తినచ్చు. చాలా రెస్టరెంట్స్ ఉన్నాయి. ఇది చాలా అందమైన వీధి. స్పేనిష్ కవి ఫ్రెడ్‌రికో గార్షియా లోర్కా 'ది అంతంలేని వీధైతే బావుండేది' ని రాసాడు."

ఆంటోనియో మాకు గుడ్ బై చెప్పి దారిలో దిగిపోయాడు. దిగేముందు అతను జేబుదొంగల గురించి మరోసారి హెచ్చరించాడు. నేను అతనికి టిప్ ఇద్దామనుకున్నా వెనక కూర్చోవడంతో కుదరలేదు.

"ఇక్కడితో మీ టూర్ పూర్తయింది. సాయంత్రం ఏడుకి డిన్నకి వెళ్తాం. హోటల్‌కి వెళ్ళాలనుకునేవాళ్ళు రెండుకి ఇక్కడికి వస్తే కోచ్ అక్కడ దింపుతుంది. లేదా ఏడుదాకా ఇక్కడ తిరిగి చూడాలనుకుంటే సరిగ్గా ఏడుకి ఇక్కడికి మీకోసం కోచ్ వస్తుంది" దీపక్ చెప్పాడు.

మేము అక్కడే ఉండిపోయి ఏడుగంటలకి దీపకి సూచించిన చోటికి వస్తామని చెప్పాం.

వాహనాలు రాకూడని రాంబ్లాస్ వీధికి అటు, ఇటు పెద్ద చెట్లున్నాయి. ఇది కేవలం పాదచారుల వీధి. పేవ్‌మెంట్ కెఫేలు, సూవెనీర్ షాప్స్ చాలా ఉన్నాయి. లంచ్ మాదే కాబట్టి వెజిటేరియన్ రెస్టరెంట్ కోసం వెదికాం. అరోమాస్ ద ఇస్తాంబుల్ అనే రెస్టరెంట్లో మెడిటరేనియన్ ఫుడ్ హమ్మస్ (యూరోలు 4.90 సెంట్లు) ఫలాఫెల్ (4.30) పీటా బ్రెడ్ (2) తిన్నాం. ఆఖరి లంచ్ కాబట్టి గుప్తాజీ మా ఇద్దరికీ, జయదేవ్‌కి తనే బిల్ చెల్లించాడు. తర్వాత ఆ రోడ్‌లో కొంతదూరం నడిచి వెళితే దారిలో ఓపెన్ ఎయిర్ ఫ్లవర్ మార్కెట్, క్రిస్టఫర్ కొలంబస్ మాన్యుమెంట్, ఓ పెద్ద ఫౌంటెన్ కనిపించాయి.




పర్యాటకులతో కళకళలాడుతూ ఈ వీధంతా ఎంతో సందడిగా ఉంది అక్కడినించి ప్లాకా రియల్ అనే 19వ శతాబ్దపు స్క్వేర్ దగ్గరకి వెళ్ళాం. ఇక్కడ రోడ్‌కి అటు ఇటు పొడవైన పాం చెట్లు, దీపస్థంభాలు ఉన్నాయి. దీన్నికూడా ఏంటోనీ గాడీ డిజైన్ చేసాడు.

తర్వాత బార్సిలోనా నగరం మధ్యలో ఉన్న కేటలూనియా స్క్వేర్‌కి వెళ్ళాం. దీని విస్తీర్ణం లక్షా అరవై నాలుగువేల అడుగులు. ఇక్కడ ఫౌంటెన్స్, విగ్రహాలు ఉన్నాయి. ఇది బార్సిలోనాలోని స్థానికులకి కూడా పాపులర్ ఎట్రాక్షన్. 19వ శతాబ్దంలో పురాతన సిటీ వాల్స్‌ని పడగొట్టాక అర్బన్ ప్లానర్స్ పబ్లిక్ స్పేసెస్‌ని డిజైన్ చేసి ఆ888లో ఈ స్క్వేర్‌ని నిర్మించారనే ఫలకాన్ని చదివాను. 1902-1929లలో దీన్ని అభివృద్ధి చేసి, కింద మెట్రో స్టేషన్‌ని నిర్మించారు. మే 2011లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు జరిగిన స్క్వేర్ ఇదే. ఇక్కడి విగ్రహాలు నియో క్లాసిజం, అవాంతే గార్డెకి చెందినవి. ఇక్కడి కెఫేలకి రచయితలు, చిత్రకారులు వస్తూంటారు. మూడు అంతస్థుల ఎల్ ట్రయాంగిల్ అనే షాపింగ్ సెంటర్ని చూసాం. కెనడా కన్సులేట్ కూడా కనిపించింది. అండర్ గ్రౌండ్‌లో మెట్రో స్టేషన్ నించి, ఉపరితలంలో రోడ్లమీద ట్రాన్స్‌పోర్ట్ హబ్స్ ఉన్నాయి. పావురాలు ఎక్కువ కనిపించాయి. మేము చూడలేదు కాని సమీపంలోనే మెడిటరేనియన్ నేవల్ హిస్టరీ మ్యూజియం ఉంది.

ఐదున్నరకి నేను ఓ రెస్టారెంట్‌లో టీ తాగాను. అది నచ్చడంతో నాకు ఇచ్చిన టీ బేగ్ పై రేపర్‌తో కేరీ ఫోర్ అనే చెయిన్ సూపర్ బజార్లో వాటికోసం వెదికానుకానీ లేవు.

మాజీ స్పానిష్ కాలనీల్లోని ప్రజలు స్పెయిన్ పౌరసత్వం కావాలంటే తీసుకోవచ్చు. అందుకు స్పెయిన్‌లో రెండేళ్ళు లీగల్‌గా వుంటే చాలు. ఇండియాలో స్పానిష్ కాలనీలేదు. ఫ్రెంచ్ కాలనీల్లోని వారికి కూడా కొన్ని అర్హతలతో ఇదే సౌకర్యం ఉంది. మన దేశంలోని పాండిచ్చేరి, యానాం, మాహేలంటి చోట్లనించి చాలామంది అలా ఫ్రాన్స్‌కి వలస వెళ్ళిపోయారు. ఇంగ్లండ్ వాళ్ళు మాత్రం ఈ సౌకర్యాన్ని ఇవ్వలేదు. లేదా సగం మంది ఇండియన్స్ అక్కడే ఉండేవారేమో.

ఆరుముప్పావుకి కోచ్ వచ్చింది. డిన్నర్‌కి తందూర్ అనే ఇండియన్ రెస్టారెంట్‌కి వెళ్ళాం. దీంట్లో స్ట్రీట్ అనే కాక్ టైల్ బార్ కూడా ఉంది. గుప్తాజీ, జయదేవ్, మేమిద్దరం ఓ టేబుల్ ముందు కూర్చున్నాం. వెజ్ బిర్యానీ, ఆలూ టిక్కీ, వెజ్ సలాడ్, రోటీ, సబ్జీలు సర్వ్ చేసారు. భోజనం బావుంది.

తిరిగి హోటల్‌కి వెళ్ళేప్పుడు దీపక్ చెప్పాడు.

"రేపు మన ఫ్లైట్స్ ఉదయం ఎనిమిది నించి డిఫరెంట్ టైమ్స్‌లో ఉన్నాయి. ఉదయం ఐదింటికి లేచి ఆరుకి రెడీ అయి చెక్ అవుట్ అవండి. బ్రేక్‌ఫాస్ట్ పేక్ చేసి ఇస్తారు. నేను రేపు ఉదయం లండన్‌కి వెళ్ళి ఇండియా నించి వచ్చే కొత్త గ్రూప్‌ని రిసీవ్ చేసుకోవాలి. కాబట్టి మీ విమానం డిపార్చర్ ఎప్పుడున్నా అంతా కలిసి వెళ్దాం. మనల్ని ఏర్‌పోర్ట్‌లో డ్రాప్ చేసి కోచ్ వెళ్ళిపోతుంది. ఆ తర్వాత రావాలనుకుంటే మీరు టేక్సీలో ఏర్‌పోర్ట్‌కి వెళ్ళచ్చు."

***19-9-2015***

దీపక్ చెప్పినట్లుగా ఉదయం ఆరుకి హోటల్లోంచి చెకౌట్ అయ్యాం. రూంలో ఉండిపోకుండా అంతా వచ్చారు. దీపక్ కోచ్‌లో అందరికీ బ్రేక్‌ఫాస్ట్ పేకెట్స్ ఇచ్చాడు. అందులో వెజ్ సేండ్‌విచ్, 200 యం ఎల్ వాటర్ బాటిల్, ఒక అరటిపండు ఉన్నాయి. కోచ్ తొమ్మిది కిలోమీటర్లలోని బార్సిలోనా ఎల్ ప్రాత్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్నాక డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి మా సామానుతో టెర్మినల్ - 1కి చేరుకున్నాం. మా ఫ్లైట్ మధ్యాహ్నం 1.55కి. గుప్తాజీ ఢిల్లీ ఫ్లైట్ తొమ్మిదికి. ఆయన వెంటనే మాకు బై చెప్పి వెళ్ళిపోయారు. తర్వాత బాంబే గ్రూప్ వారు, దీపక్ కూడా వెళ్ళిపోయారు. గ్రూప్‌లో కలకత్తాకి వెళ్ళే ఫ్లైట్ మా ఫ్లైట్ తర్వాత. వారు ఇద్దరు, మేము పదిమందిమి మిగిలిపోయాం. 11.30కి మా పాస్‌పోర్ట్‌లని చూపించి చెకిన్ అయ్యాం. బార్సిలోనా నించి దుబాయ్‌కి మా ఎమిరేట్స్ ఫ్లైట్ నంబర్ 3074.

దుబాయ్ స్థానిక టైం రాత్రి 11.10కి మా ఫ్లైట్ దుబాయ్ విమానాశ్రయంలో దిగింది. మా ఫ్లైట్‌లోనే దుబాయ్ వచ్చిన జయదేవ్ అక్కడనించి బెంగుళూర్ ఫ్లైట్ గేట్‌కి, మేము 3.40కి దుబాయ్ నించి హైదరాబాద్‌కి వెళ్ళే గేట్‌కి చేరుకున్నాం. మా ఫ్లైట్ నంబర్ 0526. మేము ఫ్రీక్వెంట్ ఫ్లయర్స్ కాబట్టి మా టికెట్స్‌ని బిజినెస్ క్లాస్‌కి అప్‌గ్రేడ్ చేసారు. హైద్రాబాద్ స్థానిక టైం ఉదయం 8.50కి హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగాం.

అక్కడనించి 10.35కి ఇంటికి చేరడంతో మా స్పెయిన్, పోర్చుగల్ ట్రిప్ ముగిసింది.

***(సమాప్తం)***

Post your comments